


శాకంబరిగా రాజరాజేశ్వరి

నెల్లూరు(బృందావనం): ఆషాఢ శుక్రవారాన్ని పురస్కరించుకొని నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. దేవస్థాన ప్రాంగణంలోని అనివెట్టి మండపంలో వెయ్యి కిలోలకు పైగా చిక్కుడు గింజలు, వివిధ కాయగూరలతో కాళికామాత అలంకారంలో కొలువై భక్తులను కటాక్షించారు. రాహుకాల దీపాలను భక్తులు వెలిగించారు. సామూహిక లలితా సహస్రనామ పారాయణాన్ని పఠించారు. ఉభయకర్తలుగా కొలపర్తి వెంకటరమేష్, సువర్ణలక్ష్మి దంపతులు వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, వేదపారాయణం, సంధ్యామేళం, కుంభహారతులను నిర్వహించారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

గోరింటాకు అలంకారంలో
కన్యకాపరమేశ్వరి

నెల్లూరు(బృందావనం): ఆషాఢ శుక్రవారాన్ని పురస్కరించుకొని స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు గోరింటాకు అలంకారంలో దర్శనమిచ్చారు. 500 కిలోల గోరింటాకు, వివిధ రకాల సుగంధభరిత పుష్పాలతో అలంకరించారు. దేవస్థాన చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, ప్రధాన కార్యదర్శి నిచ్చెనమెట్ల చిరంజీవి, కోశాధికారి వొమ్మెన జనార్దన్, ఉపాధ్యక్షుడు వెంకటప్రసాద్, సహాయ కార్యదర్శి మునగా వెంకటేశ్వర్లు, హేమంత్, చిరంజీవి, పాబోలు సత్యం, జయకృష్ణ, అశోక్, బ్రహ్మయ్య తదితరులు పర్యవేక్షించారు.



ఆలయాలకు సారె సమర్పణ

నెల్లూరు(బృందావనం): జిల్లాలోని వివిధ గ్రామాల్లో కొలువైన గ్రామదేవతల ఆలయాల్లో ధూపదీప నైవేద్యం కోసం సారె సమర్పణను చేపట్టామని కాశీనాయన ఆశ్రమ సేవకుడు ధన్వి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆషాఢ శుక్రవారాన్ని పురస్కరించుకొని జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 30 గ్రామదేవతల ఆలయాలకు సారెను వైకుంఠపురంలోని కాశీనాయన ఆశ్రమంలో గల దుర్గమ్మ ఆలయంలో అందజేశారు. కుడుముల వెంకటేష్, భువన, ఆర్కాట్ వెంకటేష్, వెంకటేశ్వర్లునాయుడు, దర్శిగుంట వెంకటేష్, లక్ష్మి, వనిత, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసన్నకు పరామర్శ



నెల్లూరు (పొగతోట): మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో పలువురు శుక్రవారం కలిశారు.



మైనార్టీ నేతలు సిద్దిక్, అబ్దుల్ అహ్మద్, సమీర్‌ఖాన్, పార్టీ మహిళా విభాగ జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి తదితరులు పరామర్శించారు.

క్లుప్తంగా

న్యాయం జరిగేంత వరకు పోరాటం ఆగదు

నెల్లూరు(బారకాసు): తనకు న్యాయం జరిగేంత వరకు ఆమరణ దీక్షను ఎట్టి పరిస్థితుల్లో విరమించేది లేదని కావలి మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ రావెళ్ల భాస్కర్ స్పష్టం చేశారు. కార్పొరేషన్ కార్యాలయ ఆవరణంలో భాస్కర్ చేపట్టిన ఆమరణ దీక్ష శుక్రవారం కొనసాగింది. ఈ నేపథ్యంలో ఆరోగ్య పరిస్థితిని పరీక్షించేందుకు గానూ నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి పోలీసులు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి ఫ్లూయిడ్స్ ఇస్తామని చెప్పగా అందుకు ఆయన నిరాకరించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడారు. కావలి కమిషనర్ సాగిస్తున్న అవినీతిని ప్రశ్నించినందుకు గానూ తనను అక్రమంగా సూళ్లూరుపేట మున్సిపాలిటీకి బదిలీ చేశారని ఆరోపించారు. అవినీతి, అక్రమాలపై ఆధారాలతో సహా కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి తెలియజేస్తే కమిషనర్‌కు వంత పాడుతూ తనను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థపై ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి ఎందుకంత అసూయ అని ప్రశ్నించారు. ప్రభుత్వోద్యోగులకు గత ప్రభుత్వంలో స్వేచ్ఛ ఉండేదని, అయితే ఇప్పుడు లేదన్నారు.

విద్యార్థికి నగదు ప్రోత్సాహకాల అందజేత

ఇందుకూరుపేట: మండలంలోని నరసాపురంలోని ఎమ్వీఆర్‌ఆర్ ఉన్నత పాఠశాలలో గత విద్యాసంవత్సరంలో పదోతరగతి ఫలితాల్లో 593 మార్కులు సాధించిన గుడి భార్గవ్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం పీ నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ ముజీర్ రూ.10 వేల చొప్పున మొత్తం రూ.20 వేల నగదు బహుమతిని ఎంఈఓ – 2 సునీల్ చేతుల మీదుగా అందజేశారు.

కార్మికులకు వైద్య పరీక్షలు

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలోని ఆంజనేయ సీఫుడ్స్ ఫ్యాక్టరీలో కార్మికులకు కొడవలూరు పీహెచ్‌సీ వైద్యసిబ్బంది శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. 60 మంది కార్మికులకు రక్త పరీక్షలు చేశారు. బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్యాధికారి ఎం రామకృష్ణ మాట్లాడుతూ ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులు తరచూ వైద్య పరీక్షలు చేయించుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే అనారోగ్యాల బారిన పడకుండా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఏలు షఫీఉద్దీన్, సుధాకర్, ఎమ్మెల్‌హెచ్‌పీ స్నేహ, ఏఎన్‌ఎంలు సలోమి, హిమజ, ప్రోగ్రామ్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన

ముత్తుకూరు(పొదలకూరు) : కీటక జనిత వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. డెంగీ మాసోత్సవాల్లో భాగంగా ముత్తుకూరు మండలం బ్రహ్మదేవం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు కీటకాల ద్వారా సంక్రమించే వ్యాధులపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలతో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, బోధకాలు వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించి ఇళ్లలోని నీటి నిల్వలను తొలగించాలన్నారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ శాస్త్రి, హెచ్‌వీ ప్రమీల, ఉపాధ్యాయులు, ఆరోగ్య సహాయకులు బాలకృష్ణ, రాజగోపాల్, నవీన్ ఉష, చంద్రకళ, అమృత పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

వెంకటాచలం: టీబీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా లెప్రసీ అండ్ ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ ఎస్‌కే ఖాదర్‌వలీ సూచించారు. మండలంలోని చెముడుగుంట వద్ద ఉన్న జిల్లా జైలులోని ఖైదీలకు టీబీ వ్యాధిపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సి చర్యలపై అవగాహన కల్పించారు. విపరీతమైన దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం టీబీ లక్షణాలని తెలిపారు. పొగతాగే, ఆల్కహాల్ ఎక్కువగా తీసుకునే వారు, 60 ఏళ్లు దాటిన వారు తప్పనిసరిగా గళ్ల పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జైలు సూపరింటెండెంట్ సన్యాసిరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న ఇంటిపై దాడి హేయం



మాట్లాడుతున్న మైనార్టీ నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడి హేయమైన చర్యగా పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్ అభివర్ణించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. జిల్లా చరిత్రలో ఇలాంటి దాడులను ఎప్పుడూ చూడలేదని చెప్పారు. ప్రసన్న తల్లి వయస్సును దృష్టిలో ఉంచుకోకుండా భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. మాజీ మంత్రి, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయనకే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో దీని ద్వారా అర్థమవుతోందని చెప్పారు. ప్రతి విమర్శను తట్టుకోలేక ఇలా వ్యవహరించడం సరికాదని హితవు పలికారు. వీపీఆర్ దంపతులపై ఇప్పటికైనా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ముస్లిం మైనార్టీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ హంజా హుస్సేనీ, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మగ్దూమ్ మొయిద్దీన్, ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు సిద్ధిఖ్, అబ్దుల్ మస్తాన్, గయాజుద్దీన్, కార్పొరేటర్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కాదు.. హత్యాయత్నమే

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై జరిగింది దాడి కాదని.. అధికార పార్టీ ప్రేరేపిత హత్యాయత్నమేనని పార్టీ విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు ఆశ్రిత్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఇంట్లో ఆయన లేని సమయంలో దాడి చేశారని ధ్వజమెత్తారు. ప్రసన్న తల్లిని బయటకు లాగి చివరికి ఆమె ఉండే గదిని సైతం ధ్వంసం చేశారని మండిపడ్డారు. దాదాపు 200 మంది రౌడీమూకలొచ్చి దాడి చేశారని, పోలీస్ శాఖ ఎలాంటి భద్రత కల్పిస్తోందనే అంశం దీని ద్వారా తెలుస్తోందన్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసులు, సిట్ విచారణలపై శ్రద్ధ చూపేందుకే పరిమితమవుతున్నారని ధ్వజమెత్తారు. నెల్లూరు రూరల్ అధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, నగరాధ్యక్షుడు తౌఫిక్, రాష్ట్ర కార్యదర్శి సతీష్‌బాబు, కోవూరు నియోజకవర్గ అధ్యక్షుడు జెడ్డా సాయికుమార్, చంద్ర, లోకేష్, నయస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యార్థి విభాగ నేతలు

జనాభా పెరుగుదలతో అనర్థాలు

నెల్లూరు(అర్బన్): జనాభా పెరుగుదలతో అనర్థాలు సంభవిస్తాయని డీఎంహెచ్‌ఓ సుజాత పేర్కొన్నారు. ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పొదలకూరు రోడ్డులో ర్యాలీని శుక్రవారం ఆమె ప్రారంభించారు. అడిషనల్ డీఎల్‌ఏటీఓ అధికారి ఖాదర్‌వలీ, డెమో అధికారి కనకరత్నం, డీఐఓ ఉమామహేశ్వరి, డాక్టర్ రమేష్, జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, డాక్టర్ వీణాభారతి, ఏఎంఓ నాగార్జునరావు, హెచ్‌ఈఓ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న సుజాత

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిని చింతారెడ్డిపాళెంలోని ఆయన నివాసంలో పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పేర్నేటి కోటేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను విజయకుమార్‌రెడ్డి సత్కరించారు.



సీజనల్ వ్యాధుల నివారణకు కృషి

నెల్లూరు(అర్బన్): జిల్లాలో డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికున్‌గన్యా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యశాఖ సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ సుజాత సూచించారు. నగరంలోని లేక్ వ్యూ కాలనీలో వైద్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన డ్రైడే.. డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. నిల్వ ఉన్న నీటిలో దోమలు పెరుగుతాయని, ఈ క్రమంలో వారానికోసారి నీటి తొట్లను శుభ్రపర్చాలని సూచించారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరారు. జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, సహాయాధికారి నాగార్జునరావు, అర్బన్ హెల్త్ సెంటర్ సీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన



నెల్లూరు (టౌన్): ఎన్నికలపై నగరంలోని విశ్వసాయి – ఎస్సార్కే పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. తరగతి లీడర్ తదితరులను ఓటు ద్వారా ఎన్నుకున్నారు. ప్రిన్సిపల్ రఘురామ్, స్కూల్ డైరెక్టర్ కృష్ణమోహన్, రావూస్ డైరెక్టర్ శివసంకేత్, విశ్వసాయి విద్యాసంస్థల చైర్మన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిరిగోల్డ్ బాధితులను ఆదుకోవాలని వినతి

నెల్లూరు(క్రైమ్): సిరిగోల్డ్ బాధితులను ఆదుకోవాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు సీఐడీ డీఎస్పీ కోటారెడ్డికి వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సంస్థ బోర్డు తిప్పేయడంతో పెట్టుబడులు పెట్టిన వారు నష్టపోయారని చెప్పారు. అప్పుల బాధతో 15 మంది మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. భూములను వేలమేసి వచ్చిన నగదును బాధితులకు అందించేలా చూడాలని కోరారు.

పీహెచ్‌పీల సేవలు అభినందనీయం

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ ఆరోగ్య సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వాములై తమ వంతు సేవలందిస్తున్న పీహెచ్‌పీ అసోసియేషన్ నేతల సేవలను డీఎంహెచ్‌ఓ సుజాత అభినందించారు. బారాషహీద్ దర్గా వద్ద వైద్య శాఖ నిర్వహించిన శిబిరంలో ఐదు రోజుల పాటు వైద్యసేవలందించిన పీఎంపీ నేతలకు జ్ఞాపికలను దర్గా ప్రాంగణంలో ఆమె అందజేశారు. ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, కోశాధికారి దేవరకొండ శ్రీనివాసులు, రూడ్స్ సంస్థ చైర్మన్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలందక ఉపాధ్యాయుల ఇక్కట్లు

నెల్లూరు (టౌన్): జిల్లాలో ఉద్యోగోన్నతి లేదా బదిలీ అయిన ఉపాధ్యాయులకు జూన్‌కు సంబంధించి జీతాలను చెల్లించలేదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేషు, ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. జీతాలందని కారణంగా ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. బదిలీలు జరిగి నెల గడిచినా వివరాలను అప్‌డేట్ చేయలేదని తెలిపారు.

ధర్మరాజస్వామి దేవస్థానంలో పూజలు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని ద్రౌపదీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా చప్పరోత్సవం, భద్రకాళి పూజలు తదితరాలను శుక్రవారం జరిపారు. ఉభయకర్తలుగా గండవరపు బాలయ్య, అత్తిపాటి రామచంద్రయ్య, రాజ్యలక్ష్మి, ఉదయ్‌కుమార్, కుసుమప్రియ, గోపీకృష్ణ సోదరులు తదితరులు వ్యవహరించారు. ఈఓ జానకి తదితరులు పర్యవేక్షించారు.

మెగా నేత్ర వైద్యశిబిరం రేపు

నెల్లూరు(బృందావనం): గురుపూర్ణిమ మహోత్సవాలను పురస్కరించుకొని సాయి దర్బార్ అద్దాల మందిరంలో మెగా ఉచిత నేత్ర శిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నామని మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య పరీక్షలు, శస్త్రచికిత్సలను ఉచితంగా చేయడంతో పాటు మందులను ఇవ్వనున్నామని వివరించారు. వివరాలకు 88856 44118, 95028 49784 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

భాగవత సప్తాహం



నెల్లూరు(బృందావనం): భాగవత శ్రవణం ముక్తిదాయకమని రామకృష్ణ మిషన్ నిర్వాహకుడు స్వామి హృదానంద మహరాజ్ పేర్కొన్నారు. నవలాకులతోటలోని రామకృష్ణ మిషన్‌లో భాగవత సప్తాహ కార్యక్రమాన్ని పద్యసారస్వత పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ప్రహ్లాద చరిత్రపై కోట రాజశేఖర్ ఉపన్యసించారు. సభాపోషకుడిగా ప్రపంచ తెలుగు సమాఖ్య, నెల్లూరు ప్రాంతీయ అధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు వ్యవహరించారు. సుబ్బారావు, లక్ష్మీనారాయణ, టేకుమళ్ల వెంకటప్పయ్య, జయప్రసాద్, శ్రీరామ్మూర్తి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నాశనం చేస్తున్నారు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యా వ్యవస్థను ప్రైవేటీకరించి నాశనం చేస్తున్నారని ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ సెంట్రల్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ శిబాసిన్ ప్రహరాజ్ ఆరోపించారు. కొండాయపాళెం సమీపంలోని పాత ఇన్ఫంట్ జీసస్ స్కూల్ ప్రాంగణంలో ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర స్థాయి విద్యార్థుల శిక్షణ శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత అల్లూరి సీతారామరాజు, శ్రీశ్రీ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువతరాన్ని మద్యం, మాదకద్రవ్యాలకు బానిసలుగా మారుస్తున్నారని ఆరోపించారు. ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర ఆఫీస్ సెక్రటరీ మొబీనా, మాజీ రాష్ట్ర కార్యదర్శి అమర్‌నాథ్, కేరళ అధ్యక్షురాలు అలీనా, కర్ణాటక కార్యదర్శి అజయ్‌కామత్, రాష్ట్ర అధ్యక్షుడు హరీష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శిబాసిన్ ప్రహరాజ్

హత్య కేసును పునర్విచారించాలి

నెల్లూరు(క్రైమ్): నగరంలో రెండు నెలల క్రితం దారుణహత్యకు గురైన గొల్లపల్లి చిన్నయ్య కేసులో పలు అనుమానాలున్నాయని.. పునర్విచారించి అసలు నిందితులపై చర్యలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్పీ సౌజన్యకు వినతిపత్రాన్ని చిన్నయ్య కుటుంబసభ్యులతో కలిసి ఎమ్మార్పీఎస్ నేతలు గొల్లపల్లి శ్రీనివాసులు, పెంచలయ్య, వెంకటేశ్వరరావు, అంబేడ్కర్ తదితరులు శుక్రవారం అందజేశారు. తొలుత కేవీఆర్ పెట్రోల్ బంకు నుంచి జిల్లా పోలీస్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీని నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

ఆర్మీలో అవకాశాలపై అవగాహన



నెల్లూరు (టౌన్): ఆర్మీలో అవకాశాలపై నగరంలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం అవగాహన కల్పించారు. పలు అంశాలను గుంటూరు డైరెక్టర్, కల్నల్ రజత్ సువర్ణ తెలియజేశారు. సీఓ కల్నల్ అరుణకుమార్, లెఫ్టినెంట్ కల్నల్ దినేష్, కళాశాల డీన్ సుధారాణి, ప్రిన్సిపల్ నాగయ్య, ఎన్‌సీసీ అధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నేతల నిరసన

నెల్లూరు (టౌన్): డిగ్రీలో డబుల్ మేజర్ విధానాన్ని కొనసాగించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు వెన్ను నరేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు వీఆర్సీ సెంటర్‌లో శుక్రవారం చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ భారాన్ని తగ్గించాలని కోరారు. నేతలు వంశీ, నాగేంద్ర, సుకుమార్, యశ్వంత్, లోకేష్, ధనుష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న తరుణంలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- శెట్టిగుంట రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని మూడో మైలు, ప్రశాంతినగర్, వెంగళరెడ్డినగర్, రాజీవ్‌గాంధీకాలనీ, ఇండస్ట్రియల్ ఏరియా, డీఎస్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.
- ఎన్టీఆర్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్, సరస్వతీనగర్, పుట్టవీధి, పద్మావతినగర్, ఆదిత్యనగర్, బాలాజీనగర్.. కోటమిట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని జెండావీధి, కోటమిట్ట, కామాటివీధి తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.
- రంగనాథ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇసుకడొంక, రంగనాయకులపేట, కపాడిపాళెం, సంతపేట, రైల్వేస్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. పడారుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని సుందరయ్యకాలనీ, పడారుపల్లి, సప్తగిరికాలనీ, ఆర్టీఏ కార్యాలయం, మినీ బైపాస్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 వరకు సరపరా ఉండదని వివరించారు.
- ఇరుగాళమ్మ సబ్‌స్టేషన్ పరిధిలోని రాజాగారి వీధి, శాంతినగర్, ఒట్టాడిపాళెం, శివగిరి కాలనీ తదితర ప్రాంతాలు.. రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని మనుమసిద్ధినగర్, పుత్తా ఎస్టేట్స్, గుప్తా పార్కు, ఈద్గామిట్ట, పొర్లుకట్ట, ములుమూడి బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.
- కలెక్టరేట్ ఫీడర్ పరిధిలోని ఆచారివీధి, మధ్వపతివారి వీధి, ముంగమూరివారివీధి, పెద్ద పోస్టాఫీస్ వీధి తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నెల్లూరు(అర్బన్): బుజబుజనెల్లూరులోని సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా బుజబుజ నెల్లూరు, ఆర్టీసీ కాలనీ, శివాజీనగర్, భగత్‌సింగ్ కాలనీ, వల్లూరమ్మ కాలనీ, కళాకారుల కాలనీ, గొల్లపాళెం తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని ఏఈ రాజబాబు తెలిపారు.